సాక్షి
చిత్తూరు
గురువారం । 9 । మార్చి । 2023



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.53,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,100

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.65,000
రిటైల్ వెండి గ్రాము	రూ.67

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	33	18
తిరుపతి	34	19
తిరుమల	29	15
గూడూరు	33	22
నగరి	35	19



అడవితల్లికి రక్షణ!

తిరుపతి అలిపిరి : అడవుల సంరక్షణకు ఫారెస్ట్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. అగ్నిప్రమాదాల కట్టడికి జాగ్రతలు తీసుకుంటున్నారు – 8లో

న్యూస్‌రీల్

వినాయకుని హుండీ ఆదాయం రూ.85 లక్షలు



కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ.85లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఆలయంలో 13 రోజుల హుండీ కానుకల ఆదాయాన్ని బుధవారం ఆస్థాన మండపంలో లెక్కించారు. బంగారం 40 గ్రాములు, వెండి కిలో 510 గ్రాములు, ఫారిన్ కరెన్సీ యూఎస్ఏ 697 డాలర్లు, ఇంగ్లాండ్ 50 పౌండ్లు, సింగపూర్ 10 డాలర్లు, మలేషియా 6 రింగ్గిట్స్, యూఏఈ 40 దినార్‌లతో కలిపి మొత్తం రూ.85 లక్షలు ఆదాయం లభించింది. ఆలయ అభివృద్ధి పనులకు ఈ ఆదాయాన్ని వెచ్చించనున్నట్లు చైర్మన్, ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు విద్యాసాగర్ రెడ్డి, హేమమాలిని, పర్యవేక్షకులు శ్రీధర్ బాబు, కోదండపాణి, రవి, యూనియన్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగు సిబ్బందికి రాష్ట్ర అవార్డు



అవార్డు అందుకుంటున్న వెలుగు సిబ్బంది

చిత్తూరు అగ్రికల్చర్/యాదమరి : అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన వెలుగు సిబ్బంది రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. విజయవాడలో బుధవారం జరిగిన రాష్ట్ర స్థాయి మహిళ దినోత్సవంలో సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ చేతుల మీదుగా జిల్లాకు చెందిన ఏపీఎంలు హేమ(చిత్తూరు), కల్పలత(యాదమరి), సీసీ ఉష(తవణంపల్లె) ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహించడం, గ్రూపు సభ్యులకు సకాలంలో రుణాలు అందించడం, బ్యాంకులకు సకాలంలో రికవరీ చేయించడంలో వారి సేవలను గుర్తించి ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేశారు.

దళితులకు ఎస్సీ కమిషన్ అండ



మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

చిత్తూరు కలెక్టరేట్ : దళితులకు రాష్ట్ర ఎస్సీ కమిషన్ అండగా ఉంటుందని కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన చిత్తూరు నగర పరిధిలోని కోడిగుట్ట వద్ద దళిత సంఘాల ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కోడిగుట్ట పంచాయతీ కుప్పనపల్లె దళితులపై ఇటీవల జరిగిన దాడిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించినట్లు చెప్పారు. దళితులకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలను అమ్ముకుంటున్న వారిని ప్రశ్నించినందుకు దాడికి దిగడం అన్యాయమన్నారు. దాడిలో గాయపడ్డ వెంకటేశు, వారి కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా కమిషన్ చర్యలు చేపడుతుందని హామీ ఇచ్చారు. దళితులకు కేటాయించిన ఇంటి స్థలాలను కబ్జా చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. బాధితులపై దాడిచేసిన వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్, ఎస్పీతో త్వరలో సమావేశమై బాధితులను న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు దళితులు, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు అన్నీ ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 59,751 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 20,177 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.80 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారు 12 గంటల్లో , ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు.

ప్రచారంలో దూకుడు



బైరెడ్డిపల్లె మండలం బేలుపల్లెలో ఎన్నికల ప్రచారంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థులు ప్రచారంలో దూసుకు పోతున్నారు. ఈనెల 13న పోలింగ్ తేదీ దగ్గరపడుతున్న కొద్దీ ఇంటింటి ప్రచారం ముమ్మరం చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పలు సంఘాల మద్దతుతో ప్రచారంలో ముందున్నారు. పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి ఉద్యోగులు, పట్టభద్రులు మద్దతు ప్రకటిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్ల సంక్షేమ పాలనపై పట్టభద్రులు పూర్తి సంతృప్తిలో ఉన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలు, ఉద్యోగ మేళాలు, పలు నోటిఫికేషన్ల ద్వారా లక్షలాదిగా ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంపై శ్యాంప్రసాద్‌రెడ్డికి అన్ని వర్గాల మద్దతు లభించడంతో పాటు మెజారిటీ ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

- ప్రభుత్వ పారదర్శక, సంక్షేమ పాలనకు సంఘాల మద్దతు
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకే జై కొడుతున్న ఎమ్మెల్సీ ఓటర్లు
- విశాఖ గ్లోబల్ సమ్మిట్‌తో రెట్టించిన ఉత్సాహంతో పట్టభద్రులు
- సమస్యల పరిష్కరిస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో ఉద్యోగుల్లో ఆనందం
- టీడీపీ, బీజేపీ అభ్యర్థులెవరో తెలియదంటున్న ఓటర్లు

సాక్షి, చిత్తూరు: జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తున్నారు. ఇదే సమయంలో గత టీడీపీ ప్రభుత్వం గ్రాడ్యుయేట్‌లకు చేసిందేమి లేదని యువత ఆగ్రహంతో రగిలిపోతోంది. వైఎస్సార్‌సీపీ సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాల విప్లవం వచ్చిందని చెబుతోంది. గతంలో పీడీఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీలు పట్టభద్రుల కోసం చేసిందేమి లేదని కూడా యువత పెదవి విరుస్తోంది.

ప్రభుత్వ పాలనపై పట్టభద్రుల్లో పూర్తి సంతృప్తి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్ల సంక్షేమ పాలనపై పట్టభద్రులు పూర్తి సంతృప్తిలో ఉన్నారు. నిరుద్యోగులకు సచివాలయం కేంద్రంగా, ఉద్యోగ మేళాల ద్వారా పెద్దపెద్ద కార్పొరేట్ కంపెనీల్లో లక్షలాదిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలిచ్చారు. గతవారం విశాఖపట్నం కేంద్రంగా జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో 378 ఒప్పందాలు జరిగాయి. దీనిద్వారా పెద్ద ఎత్తున పరిశ్రమలు రావడం, మొత్తం 6.09 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయి. దీంతో నిరుద్యోగుల్లో ఆనందం రెట్టించింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల అభ్యర్థి శ్యాంప్రసాద్ రెడ్డిని గెలిపిస్తే న్యాయం జరుగుతుందనే భావనలో పట్టభద్రులు ఉన్నారు. టీడీపీ పాలనలో నిరుద్యోగభృతి పేరుతో మోసం చేశారని యువత భగ్గుమంటోంది. నెల్లూరు జిల్లాకు చెందిన శ్యాంప్రసాద్‌రెడ్డికి ఉమ్మడి ప్రకాశం- నెల్లూరు- చిత్తూరు జిల్లాల్లోని పట్టభద్రులతో మంచి సంబంధాలున్నాయి. ప్రైవేట్ టీచర్లు, అధ్యాపకులకు పీఎఫ్ సౌకర్యం, హెల్త్ కార్డులతో పాటు ఎమెర్జెన్సీ ఫండ్ మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ఆయనకు బలం మరింత పెరిగిందని పట్టభద్రులే చెబుతున్నారు.

పర్వతరెడ్డి వైపే పలు సంఘాలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పలు సంఘాల మద్దతుతో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. చంద్రశేఖర్‌రెడ్డికి నెల్లూరు జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు, అసోసియేషన్ నాయకులు మద్దతుగా ఉన్నారు. ప్రకాశం, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులకు సుపరిచితులు కావడంతో ఆయనకే తమ మద్దతని ప్రైవేట్ యాజమాన్యాలు వెల్లడిస్తున్నాయి. తాజాగా ప్రభుత్వం కూడా ఉద్యోగులకు సంబంధించిన బకాయిలు కూడా త్వరలోనే చెల్లిస్తామని, ఉద్యోగులతోపాటు టీచర్లకు సంబంధించిన అన్ని సమస్యలు పరిష్కరిస్తామని వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉద్యోగులు, టీచర్ల మద్దతు పెరిగింది. మరోవైపు ప్రచారంలో దూసుకుపోతూ అందరికీ మరింత దగ్గరవుతున్నారని టీచర్ల సంఘాల నేతలతోపాటు టీచర్లు చెబుతున్నారు.

అవాక్కవుతున్న బీజేపీ, టీడీపీ అభ్యర్థులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న బీజేపీ, టీడీపీ అభ్యర్థులెవరో తమకు తెలియదని జిల్లాలోని యువత చెబుతుండడం ఆయా పార్టీల పనితీరుకు నిదర్శనం. ప్రచారానికి వెళ్లే టీడీపీ, బీజేపీ నాయకుల ఎదుటే యువత బహిరంగంగా ఈవిధంగా చెబుతుండడంతో ఆ పార్టీల నేతల విస్తుపోతున్నారు. 'మీరు యువత కోసం ఏం చేశారు' అని ప్రశ్నిస్తుండడంతో టీడీపీ, బీజేపీ నాయకులు సమాధానం చెప్పలేకపోతున్నారు. చేసేదేమి లేక ప్రచార కరపత్రాలను వారికిచ్చి ఆ పార్టీ నాయకులు వెనుదిరుగుతుండడం కొసమెరుపు.

ఓటర్ల వివరాలు

ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో

పట్టభద్రుల ఓటర్లు	3,81,181 మంది
టీచర్ల ఓటర్లు	27,694 మంది

జిల్లాల వారీగా పట్టభద్రుల ఓటర్లు

అన్నమయ్య	23,838
బాపట్ల	26,390
చిత్తూరు	54,152
ప్రకాశం	82,225
నెల్లూరు	1,07,635
తిరుపతి	85,941
మొత్తం	3,81,181

టీచర్ల ఓటర్లు...

అన్నమయ్య	1,932
బాపట్ల	1,789
చిత్తూరు	3,887
ప్రకాశం	5,789
నెల్లూరు	8,165
తిరుపతి	6,132
మొత్తం	27,694

హోలీ..రంగుల కేళీ

తిరుపతి నగరం బుధవారం వర్ణ శోభితమైంది. హోలీ సందర్భంగా పలుప్రాంతాల్లో చిన్న,పెద్ద, యువతీ, యువకులు రంగుల్లో మునిగి తేలారు. శిల్పారామంలో సంబరాలు మిన్నంటాయి. రెయిన్ వాటర్‌లో డీజే సాంగ్ నృత్యాలతో రంగులు చల్లుకుంటూ యువతీ, యువకులు సందడి చేశారు. అలాగే చిత్తూరు, తిరుపతి జిల్లా వ్యాప్తంగా హోలీ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకించి మార్వాడీ కుటుంబాలు బంధుమిత్ర సమేతంగా పండుగను జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సూచికగా అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని వారు ఆకాంక్షించారు. – తిరుపతి కల్చరల్



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

తిరుపతి అర్బన్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం తిరుపతి బాలాజీ కాలనీలోని మేక్ మై బేబీ జీనియస్ స్కూల్‌లో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో మహిళలకు పలు హక్కులు కల్పించారన్నారు. ముఖ్యంగా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. జిల్లావ్యాప్తంగా 9 నెలల్లోనే సుమారు 12 లక్షల మంది మహిళలకు క్యాన్సర్ లక్షణాలు గుర్తించామని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన మహిళలకు ప్రశంసా పత్రాలు అందించి సన్మానించారు.

11న సంకటహర చతుర్థి వ్రతం



సంకట హర చతుర్థి వ్రతం ఆచరిస్తున్న భక్తులు(ఫైల్)

- అదే రోజు రాత్రి స్వర్ణ రథోత్సవం

కాణిపాకం(యాదమరి): స్వయంభు కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఈనెల 11వ తేదీన సంకట హర చతుర్థి వ్రతం నిర్వహించనున్నారు. ఇక్కడి ఆలయంలో వ్రతం చేసుకుంటే కష్టాలు తొలగి ఆనందాలు వెల్లివిరుస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆలయంలో ప్రతి పౌర్ణమి తరువాత నాలుగో రోజు చతుర్థి రోజున ఈ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం రెండు విడతలుగా వ్రతం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌లో 150 మంది భక్తులను అనుమతిస్తారు. సంకటాలు తొలగించుకునేందుకు భక్తులు ఈ వ్రతంలో పాల్గొనవచ్చని ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి తెలిపారు. సంకట హర చతుర్థి వ్రతం సందర్భంగా శనివారం సాయంత్రం శ్రీసిద్ధి, బుద్ధి సమేతంగా వినాయకస్వామివారు స్వర్ణ రథంపై కొలువుదీరి ఆలయ మాడ వీధుల్లో భక్తులను కటాక్షించనున్నారు.

అందుబాటులో టికెట్లు



ఆలయంలో సంకటహర చతుర్థి గణపతి వ్రతం నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నాం. వ్రతంలో పాల్గొనే భక్తుల సంఖ్య పెరుగుతుండడంతో రెండు విడతలుగా నిర్వహిస్తున్నాం. ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు వ్రతం నిర్వహిస్తున్నాం. రూ.350 టికెట్ కొనుగోలు చేసి ఒకరు వ్రతంలో పాల్గొనవచ్చు. పూజా సామగ్రిని ఆలయ తరఫునే సమకూరుస్తాం.

– మోహన్ రెడ్డి, ఆలయ చైర్మన్

క్లుప్తంగా

ప్రజాస్వామ్య విధ్వంసమే బీజేపీ లక్ష్యం



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

తిరుపతి కల్చరల్ : ప్రజాస్వామ్య విధ్వంసమే లక్ష్యంగా బీజేపీ కుట్రలకు పాల్పడుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. బుధవారం తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. తమకు వ్యతిరేకంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్ష పార్టీలు, నేతలపై సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలను ఉసిగొల్పుతోందన్నారు. అయితే అదానీ గ్రూపు అభివృద్ధికి మాత్రం మోదీ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని మండిపడ్డారు. అదానీ నిర్వహిస్తున్న పోర్టుల ద్వారానే విదేశాల నుంచి గంజాయి వస్తోందని ఆరోపించారు. దేశంలో విద్య, వైద్య రంగాలను కేంద్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం మతవిద్వేషాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకునేందుకు చూస్తోందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు చిత్తశుద్ధితో పోరాటం సాగిస్తామని తెలిపారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జయలక్ష్మి, తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి పాల్గొన్నారు.

ఇంటి నుంచే లైఫ్ సర్టిఫికెట్

ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు శుభవార్త. లైఫ్ సర్టిఫికెట్‌ను ఇంటి వద్దనే ఆన్‌లైన్‌లో నమోదు చేసే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంకు (ఐపీపీబీ) ద్వారా ఈ సేవలు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ పింఛన్ దారులకు అందుతున్నాయి. ఇప్పుడు రాష్ట్ర పెన్షనర్లకు కూడా వర్తింపు చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ప్రభుత్వం విడుదల చేసింది.

- విశ్రాంత ఉద్యోగులకు తపాలా సేవలు
- వృద్ధులు, అనారోగ్య బాధితులకు ఉపశమనం
- ఇప్పటికే జిల్లాలో 2 వేల మందికి సేవలు



చిత్తూరులో విశ్రాంత ఉద్యోగి బయోమెట్రిక్ తీస్తున్న పోస్ట్‌మాన్

చిత్తూరు కార్పొరేషన్: కొత్త సంవత్సరం వస్తోందంటే పెన్షనర్లకు జీవన లైఫ్ సర్టిఫికెట్ బెంగపట్టుకుంటుంది. ఈ సర్టిఫికెట్‌ను ప్రభుత్వానికి సమర్పించి తాము జీవిస్తున్నట్లు నిరూపించుకున్న తర్వాతే వీరికి పెన్షన్ మంజూరవుతుంది. వీటికి జీవన్ ప్రమాణ్ పోర్టల్‌తో ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నా అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారు, కదలలేని స్థితిలోని వృద్ధులకు అవస్థలు తప్పడం లేదు. ఈ సమస్యల నుంచి వీరికి విముక్తి లభించేలా చర్యలు ప్రారంభమయ్యాయి. పోస్టుమేన్లు ఇంటికి వచ్చి వీరి జీవన ధ్రువపత్రాన్ని ఆన్‌లైన్‌లో అక్కడికక్కడే నమోదు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ పింఛన్‌దారులకు ఇప్పటికే ఈ పోస్టల్ సేవలు అందుతున్నాయి. రాష్ట్ర పెన్షనర్లకు వీటిని వర్తింపజేసేందుకు ఇటీవల ప్రయోగాత్మకంగా చేపట్టిన ఆన్‌లైన్ చర్యలు విజయవంతమయ్యాయి. ఫలితంగా దీన్ని అమలు చేసేందుకు ప్రభుత్వ మానవ వనరుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పింఛనుదారులు రాష్ట్రంలోని ఏ మూలన ఉన్నా ఈ సేవలతో ఉపశమనం పొందవచ్చు. జిల్లాలో ప్రభుత్వ పెన్షనర్లు 16 వేల మంది ఉన్నారు. వీరిలో చాలా మంది ఇప్పటికే బయోమెట్రిక్..ఐరిస్..షేషియల్ పద్ధతిలో ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాలను సమర్పించారు. మిగిలిన వారు ఈనెల 20వ తేదీ లోగా పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంది. ఇప్పటికి జిల్లాలో 2 వేల మంది పోస్టల్ ద్వారా బయోమెట్రిక్ సేవలను పొందారు. మిగిలిన వారు పోస్టల్ సేవలను వినియోగించుకోవచ్చు.

అందుబాటులో సేవలు



లైఫ్‌సర్టిఫికెట్ సమర్పించేందుకు ప్రభుత్వం కొత్తగా తీసుకున్న నిర్ణయంతో పెన్షనర్లకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. ప్రత్యేక యాప్‌తో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పెన్షనర్లు ఇంటి వద్దనే ఉండి ఈ యాప్‌ను తమ స్మార్ట్ ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు. దీని ద్వారా బుక్ చేసిన వెంటనే పోస్టుమేన్ ఇంటికి వచ్చి బయోమెట్రిక్ నమోదు చేయించడం ద్వారా అక్కడికక్కడే లైఫ్ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్ చేస్తారు. ఇందుకు గానూ రూ.70 సేవా రుసుంగా చెల్లిస్తే సరిపోతుంది. - చెన్నకేశవులు, సీనియర్ సూపరింటెండెంట్, తపాలాశాఖ, చిత్తూరు జిల్లా

హస్తకళా ప్రదర్శన ప్రారంభం



మాట్లాడుతున్న నాబార్డ్ డీడీ సునీల్, పక్కన దశరాథాచారి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని వెంకుసా కల్యాణ మండపంలో బుధవారం హస్తకళలు, చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభమైంది. హ్యాండీ క్రాఫ్ట్ ప్రొడ్యూసర్ కంపెనీ శ్రీకాళహస్తి వారి ఆధ్వర్యంలో డాక్టర్ బీర్ అంబేడ్కర్ హస్త శిల్పి వికాస్ యోజన ప్రాజెక్టు వారు ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. నాబార్డ్ డీడీ సునీల్ ప్రదర్శనను ప్రారంభించారు. హ్యాండీ క్రాఫ్ట్ ప్రొడ్యూసర్ కంపెనీ శ్రీకాళహస్తి మేనేజింగ్ డైరెక్టర్ గుమ్మడిపూడి దశరాథాచారి మాట్లాడుతూ హస్త కళాకారులు తయారు చేసిన కొయ్య బొమ్మలు, పలు రకాల వస్తువులను, చేనేత వస్త్రాలను సరసమైన ధరలకు విక్రయానికి ఉంచినట్లు తెలిపారు. చిత్తూరు నగర వాసులు ఈ ప్రదర్శనను ఆదరించాలని కోరారు.

శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని మెజారిటీతో గెలిపించండి

బైరెడ్డిపల్లె : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలిచేలా సమిష్టిగా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని బేలుపల్లె శ్రీకల్యాణ వేంకటరమణస్వామి ఆలయంలో బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు చేపట్టి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. పట్టభద్రులు, ఉద్యోగులను కలసి శ్యామ్‌ప్రసాద్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఉద్యోగులు, అధ్యాపకుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ ఆర్.కేశవులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం : కేసు నమోదు

సదుం: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మారుతి తెలిపారు. ఆయన కథనం మేరకు..కేవీపల్లె మండలం బండవడ్డిపల్లెకు చెందిన మేఘన(21)కు అదే గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్‌తో నాలుగేళ్ల కిందట వివాహం జరిగింది. కొద్ది రోజుల కిందట మనస్పర్థలు రావడంతో ఆమె సదుం మండలం గొడ్లవారిపల్లెలో ఉన్న పెదనాన్న రామచంద్ర ఇంటికి వచ్చేసింది. అప్పటి నుంచి పెద్దలు రాజీ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈక్రమంలో ఆమె బుధవారం ఉదయం ఇంటి నుంచి అదృశ్యం అయ్యింది. రామచంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడవితల్లికి రక్షణ!

- అగ్నిప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు
- 105 మంది వాచర్లతో నిరంతర పర్యవేక్షణ
- పటిష్టంగా ఫైర్‌లైన్స్ ఏర్పాటు
- జీవాల దాహార్తిని తీర్చేందుకు సాసర్ పిట్‌లు



అడవుల సంరక్షణకు ఫారెస్ట్‌శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. జంతుజాతులను కాపాడుకునేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నారు. అరుదైన వృక్షాల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టారు. పక్షులు ఇతర జీవుల దాహార్తిని తీర్చేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. అగ్నిప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నిప్పు రాజుకున్నా.. మంటలు వ్యాప్తిచెందకుండా ఆర్పివేసేందుకు ప్రత్యేక సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. వాచ్‌టవర్ల నుంచి అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను పరిశీలించేలా ఆదేశాలు జారీచేశారు.

తిరుపతి అలిపిరి : వేసవికాలం నేపథ్యంలో అటవీశాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. అడవులను అగ్నికీలల నుంచి కాపాడేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. సీసీఎఫ్ నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా కట్టుదిట్టంగా నిఘా పెడుతోంది. ఇందుకోసం ప్రత్యేకంగా పలువురు అధికారులకు విధులు కేటాయించింది.

ఫైర్ ఫైటింగ్ దళం

అగ్నిప్రమాదాలు సంభవిస్తే మంటలను అదుపు చేసేందుకు అటవీశాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా 105 మందితో ప్రత్యేక బృందాలను సిద్ధం చేశారు. వీరు రెండు జట్లుగా నిరంతరం పెట్రోలింగ్ చేయడంతో పాటు 15 వాచ్‌టవర్ల నుంచి అడవిలో పరిస్థితులను గమనిస్తుంటారు. ఆయా బృందాలకు కావలసిన నీళ్ల బాటిళ్లు, బూట్లు, డ్రెస్, సేఫ్టీ కిట్‌లను అందించారు. ముఖ్యంగా చామల, తిరుపతి, పనపాకం, పుత్తూరు, సత్యవేడు ఫారెస్ట్ రేంజ్‌లో పటిష్ట చర్యలు చేపట్టారు. ప్రత్యేక బృందాల అప్రమత్తత వల్ల ఇటీవల జరిగిన సుమారు 92ఘటనల్లో అగ్గిని సకాలంలో ఆర్పివేసి అడవిని రక్షించగలిగారు. అటవీ ప్రాంతంలో రాజుకునే మంటలను ఎస్ఎన్‌పీపీ శాటిలైట్ సహకారంలో డీఎఫ్ఓలు ఎప్పటికప్పుడు తెలుసుకుని, ఆ మేరకు సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

'కళాజాత'లతో చైతన్యం

అటవీ సంరక్షణ, ఎర్రచందనం అక్రమ రవాణా కట్టడికి గ్రామాల్లో కళాజాత బృందాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. అడవులకు నిప్పుపెట్టడం వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నారు.

పకడ్బందీగా ఫైర్‌లైన్స్

మంటలు అదుపు చేయడానికి వీలుగా అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. మంటల వ్యాపించకుండా ఆర్పేందుకు వీలుగా ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఉన్న 412 కిలోమీటర్ల ఫైర్‌లైన్స్‌ను పునరుద్ధరించడంతో పాటు మరో 100 కిలోమీటర్ల మేర నూతనంగా తీర్చిదిద్దుతున్నారు. 8 నుంచి 10 మీటర్లు వెడల్పుతో ఒకే వరుసలో చెట్లను, ఎండుటాకులను తొలగిస్తున్నారు. దీంతో మంటలు ఎకడికక్కడ ఆగిపోయే అవకాశముంటుందని అధికారులు వివరిస్తున్నారు.

జీవాలకు నీటి సౌకర్యం

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో ప్రస్తుతం నీటి ఎద్దడి లేదు. అయినప్పటికీ వేసవి కారణంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా శేషాచల అటవీ ప్రాంతంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన 256 సాసర్‌పిట్‌లను గుర్తించారు. ఇంకా అవసరమైన చోట్ల పిట్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందిచారు. జంతువుల దాహార్తిని తీర్చేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

బాధ్యతగా భావించాలి



అగ్నిప్రమాదాల నుంచి అడవిని కాపాడుకోవాలి. ఇది అందరూ బాధ్యతగా భావించాలి. మంటలు రాజుకుని అడవి కాలిపోతే జీవజాతులకు ముప్పు తప్పదు. పచ్చని బుగ్గి అయితే పర్యావరణ దెబ్బతింటుంది. అడవికి ఎవరూ నిప్పు పెట్టకూడదు. దీనిపై ప్రజల్లో చైతన్యం రావాలి. గ్రామీణులు సైతం పూర్తిగా సహకరించారు. సమష్టి కృషితోనే అటవీసంరక్షణ సాధ్యం. అందులో భాగంగానే ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం. అడవి జంతువులను కాపాడుకునేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. - శ్రీనివాసరావు, సబ్ డీఎఫ్ఓ, తిరుపతి



గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్న అటవీఅధికారులు



అడవుల్లో ఏర్పాటు చేస్తున్న ఫైర్‌లైన్స్

ఏకత్వంతోనే ప్రపంచ శాంతి

– పుట్టినరోజు వేడుకల్లో కల్కి భగవాన్



ఒన్నెస్ డే కార్యక్రమంలో భక్తులకు దర్శనమిస్తున్న భగవాన్ దంపతులు

వరదయ్యపాళెం: ఏకత్వంతోనే ప్రపంచ శాంతి సాధ్యమని ఆధ్యాత్మిక గురువు కల్కి భగవాన్ తెలిపారు. తన 74వ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి ఏకం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన వరల్డ్ ఒన్నెస్ డే కార్యక్రమంలో అర్ధరాత్రి 12గంటలు దాటాక భగవాన్ దంపతులు ఏకకాలంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులను ఉద్దేశించి భగవాన్ మాట్లాడుతూ శాంతి మార్గమే సమాజ శ్రేయస్సుకు సన్మార్గమన్నారు. ఆప్యాయత, అనురాగాలతో ఆనందమయ జీవితాన్ని పొందవచ్చని సూచించారు. కృష్ణాజీ, ప్రీతాజీ దంపతులు సాధన చేస్తున్న ముక్తి మార్గం, ప్రజల జీవితంలో ఆనంద వెలుగులు నింపుతాయని తెలిపారు. 34ఏళ్ల ప్రస్థానంలో తమ సిద్ధాంతాలు నమ్మిన భక్తులకు ఎంతో మేలు చేకూరిందని చెప్పారు. అవే నేడు ప్రపంచ దేశాల్లో తమ పేరు ప్రతిష్టలను ఉన్నతస్థాయిలో నిలిపాయన్నారు. చివరగా భక్తులకు అనుగ్రహ దీక్షను ప్రసాదించారు. అనంతరం కృష్ణాజీ, ప్రీతాజీ దంపతులు ముక్తి దీక్షను స్వీకరించారు. విదేశీ భక్తులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. లోకా ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ, ఆచార్య ఆనందగిరిజీ, సునీల్ దాసాజీ, ఉమాపతి, రుద్ర దాసాజీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వాహనం ఢీకొని దుప్పి మృతి



దుప్పి కళేబరం

కోట : మండలంలోని చిట్టేడు వద్ద బుధవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ దుప్పి మృతిచెందింది. దాహం తీర్చుకునేంఉదకు పొలాల్లోని బావి వద్దకు చుక్కల దుప్పి వచ్చింది. కుక్కలు తరమడంతో రోడ్డుపైకి రాగా ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు ఘటనస్థలానికి చేరుకుని దుప్పి కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

గుడుపల్లె: మండలంలోని బెగ్గిలిపల్లె గ్రామంలో బుధవారం సుబ్రమణ్యం(35) ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వెంకటేష్ కుమార్తె మునెమ్మకు కర్ణాటక రాష్ట్రం కామ సముద్రం సమీపంలోని కలవంచి గ్రామానికి చెందిన సుబ్రమణ్యంతో 15 ఏళ్ల కిందట వివాహమైంది. వివాహమైన కొన్ని నెలలకే వెంకటేష్ బెగ్గిలిపల్లెలో సుబ్రమణ్యానికి కాపురం పెట్టించాడు. వీరికి శ్రావణి, ప్రకాష్ పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య అప్పుడప్పుడు గొడవలు జరిగేవి. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఒక గదిలో తలుపులు వేసుకుని సుబ్రమణ్యం శ్లాబ్‌కమ్మీకి తాడుతో ఉరేసుకుని మృతి చెందాడు. కిటీకిలో నుంచి గమనించిన మునెమ్మ విలపిస్తూ చుట్టుపక్కల వారికి విషయం తెలిపింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానిస్తున్నారు.

సువర్ణ అధ్యాయంగా 'సమ్మిట్'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు : విశాఖపట్నంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్-2023 దేశ చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుందని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతోనే దిగ్గజ పారిశ్రామికవేత్తలు సమ్మిట్‌కు హాజరయ్యారన్నారు. రిలయన్స్, బిర్లా, ఆదానీ గ్రూపుల అధినేతలు మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావడం హర్షణీయమని చెప్పారు. సమ్మిట్‌లో రూ.13.06 లక్షల కోట్ల పెట్టుబడులతో 6.37 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు 900 ఒప్పందాలు కుదుర్చుకున్నారని వివరించారు. సమావేశంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవసేనమ్మ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, నేతలు బి.విజయ్‌కుమార్, మంజుల, రమీజా, మురళి, సాయి, గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతికి సోపానం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్ : రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి సోపానంగా విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్-2023 ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. బుధవారం నాయుడుపేటలో ఆయన మాట్లాడుతూ సమ్మిట్ విజయవంతంపై ప్రజలు సంబరాలు జరుపుకుంటున్నారన్నారు. శ్రీసిటీ, మాంబట్టు, మేనకూరు సెజ్‌లు మరింత పురోభివృద్ధిని సాధించనున్నట్లు వెల్లడించారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల్లో 75శాతం స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే రాష్ట్ర జీడీపీ పెరిగిందని స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి, ఎంపీపీలు ధనలక్ష్మి, అరుణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, కలికి మాధవరెడ్డి, ఓట్టూరు కిషోర్ యాదవ్, చదలవాడ కుమార్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఏడుగురికి గాయాలు

పాశాల : మండలంలోని దామలచెరువు పంచాయతీ పరిధిలో బుధవారం కుక్కలు దాడికి ఏడుగురు గాయపడ్డారు. బాధితుల్లో కొందరిని స్థానిక పీహెచ్‌సీకి, మరికొందరిని పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుక్కల బెడద అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.